# అమ్మకి దూరంగా...

-దూరి వెంకటరావు

"ఉద్యోగం చేసే అమ్మలు పిల్లలతో కష్టమని వాళ్లని అమ్మమ్మ తాతయ్యల వద్ద విడిచి వెడుతుంటారు. కన్నతల్లి పొత్తిళ్లలో పెరగవలసిన చిన్నారులు అలా దూరంగా ఉండడం ఎంతవరకు సమంజసం? కాలం సజావుగా సాగినంతసేపు ఫర్వాలేదు. లేనినాడు బాంధవ్యాలే బూడిదైపోతుంది" హెచ్చరించింది అలివేణి.

ఆమె మాటలు శ్రద్ధగా వింటున్న శ్రావ్య ఆలోచనలో పడింది. శ్రావ్య పరమేశంగారమ్మాయి. ఎంతో తెలివైన పిల్ల. గత కొన్నేళ్లుగా వాళ్లు తమ పొరుగునే వుంటున్నారు. ఎప్పటినుండో ఆ రెండు కుటుంబాలు సన్నిహితంగా మెలుగుతున్నాయి. హైస్కూల్లో చదువుతున్నప్పటి నుండి శ్రావ్యకు అలివేణివద్ద బాగా చనువు. తనకు ఎప్పుడే అవసరం వచ్చినా "ఆంటీ" అంటూ తన దగ్గరకు పరుగెత్తుకు రావడం ఆమె అలవాటు. ఇప్పుడూ అలాగే వచ్చింది.

అలివేణికి ఆడపిల్లలులేరు. అందుకే శ్రావ్యని కన్నకూతురిలా చూసుకుంటుంది. ఆమెకు డిగ్రీ చదువుతూ ఉండగానే మంచి ఉద్యోగమొచ్చింది. ఆమె పేరెంట్స్ అభ్యర్థనమేరకు తనే శ్రావ్యకు చక్కని సంబంధం చూసింది. స్వహస్తాలతో పెళ్లి కూతుర్ని చేసింది.చూస్తుండగానే సంవత్సరం ఇట్టే తిరిగిపోవడం, తొలి కాన్పుకి పుట్టింటికి రావడం, పండంటి మగబిడ్డను కనడం అన్నీ చకచకా జరిగిపోయాయి. మెటర్నిటీ లీవు పూర్తి కావడంతో బాబును కొన్నాళ్లపాటు కన్నవాళ్ల దగ్గర ఉంచాలనుకుంది. అయితే తన నిర్ణయాన్ని అలివేణి బలపరచకపోవడంతో ఏం చేయాలో తోచలేదు.

"మీరు చెప్పింది బాగానే వుంది. నేను, ఆయన ఆఫీసుకువెళితే బాబునెవరు చూస్తారు? చూస్తూ చూస్తూ వాడి బాధ్యత పనిమనిషిమీద నెట్టలేంకదా" అంది శ్రావ్య.

"నీతోపాటు మీ అమ్మని, నాన్నని తీసుకెళ్లు. వాళ్ల ముద్దుముచ్చట తీరుతుంది. నువ్వు బాబుని విడిచి ఉండవలసిన పని ఉండదు. అయితే వచ్చినవాళ్లు ఎన్నాళ్లని ఉండిపోతారంటావ్? అప్పుడూ మార్గం ఉంది. ఇవాళ ప్రతి ఊళ్లో పిల్లలకు ప్లేహోములున్నాయి. ఆఫీసుకెళ్లేటప్పుడు బిడ్డను వాళ్లకప్పజెప్పి తిరిగి వచ్చేటప్పుడు నీతో తీసుకెళ్లు"

"పోనీ పిల్లాడికి మూడో ఏడు వచ్చేవరకు ఇక్కడే ఉంచితే..."

"అది నీ ఇష్టం. నా అభిప్రాయం అడిగావు కాబట్టి చెప్పాను. బిడ్డ కారణంగా నువ్వు నాలాగే..." అంటూ ఆగిపోయింది అలివేణి.

ఆ మాట అంటున్నప్పుడు ఆమె గొంతు జీర బోవడం, కళ్లు చెమ్మగిల్లడం గమనించింది శ్రావ్య. నోట మాట లేక ప్రశ్నార్థకంగా చూసింది.

తన అనుభవాన్ని చెప్పమంటున్నాయి ఆమె కళ్లు. ఇక నోరు విప్పక తప్పలేదు అలివేణికి.

***

"అమ్మ ఫోన్ చేసింది"

"అలాగా... బుజ్జిగాడేమంటున్నాడు" నవ్వుతూ అడిగాడు భానుమూర్తి.

'అత్త, తాత అంటున్నాడట"

"అప్పుడే మాటలు వచ్చేసాయన్నమాట"

"ఎల్లుండి సుధీర్‌కి అన్నప్రాశనమట. వెంటనే మనల్ని బయలుదేరి రమ్మన్నారు."

"అప్పుడే వాడికి పదోనెల వచ్చేసిందా? నిన్న కాక మొన్న నువ్వు డెలివరీకి వెళ్లినట్టుంది" విస్తుపోతూ అన్నాడు భానుమూర్తి.

అలివేణి, భానుమూర్తి ఇద్దరూ ఉద్యోగస్తులే. ఇద్దరూ ఉద్యోగాలకు వెళ్లిపోతే ఇంట్లో బాబును చూసే నాధుడు ఉండడు. అందుకే వాడి బాధ్యతని అమ్మమ్మ తాతయ్యలకు అప్పజెప్పారు. మనవడంటే వాళ్లకు కూడా చాలా ఇష్టం. 'పిల్లాడి ఆలనాపాలనా మేం చూసుకుంటాం. మరేం భయం లేదు" అని అభయమివ్వడంతో 'హమ్మయ్య' అనుకుని ఊపిరి పీల్చుకున్నారు. ఎప్పుడైనా బాబును చూడాలనిపిస్తే వీళ్లే అక్కడకు వెళ్తుంటారు. ఆఫీసుకు లీవుపెట్టి ఊరికి బయలుదేరారు భానుమూర్తి దంపతులు. పుత్ర స్పర్శకోసం తపించిపోయిన అలివేణి పుట్టింట్లోకి అడుగుపెడుతూనే బాబునెత్తుకుని వాడి ముఖమంతా ముద్దులతో నింపేసింది. ఆమె ఆరాటాన్ని చూసి సన్నగా నవ్వుతూ బాబు బుగ్గమీద చిన్న చిటికె వేసాడు భానుమూర్తి. ఏడుపు లంకించుకున్నాడు సుధీర్.

అలివేణి ఎంత సముదాయించినా ఊరుకోకపోవడంతో తన ఒడిలోకి లాక్కుంది రాజ్యం. మంత్రం వేసినట్లు నోరు మూసాడు బాబు. కన్న బిడ్డకు తను దూరమైపోతున్నానేమోనన్న భావన అలివేణికి మొట్టమొదటిసారిగా కలిగిందా క్షణం.

"ఎవరు చేరదీస్తే వాళ్లనే అంటిపెట్టుకుంటారు పిల్లలు. రెండురోజులుంటాంకదా. ఈలోగా మనకీ వాడు చేరికైపోతాడులే. కంగారుపడకు" అన్నాడు భానుమూర్తి. మరి మాట్లాడలేదు అలివేణి.

అన్నప్రాసన కార్యక్రమం అనంతరం తిరుగు ముఖం పట్టారు భానుమూర్తి దంపతులు. బాబును వదిలివెళ్లడానికి బాధగా ఉన్నా మనసు దిటవు చేసుకోక తప్పలేదు అలివేణికి.

***

సాయంత్రం ఆఫీసు నుండి వస్తూనే చీర మార్చుకుని కాఫీ కలుపుదామని వంటగదిలోకి వెళ్లింది అలివేణి. అప్పుడే ఫోను మ్రోగింది.

రిసీవర్ అందుకున్నాడు భానుమూర్తి.

"నేను జగన్నాధాన్ని. బాబుకు సీరియస్‌గా ఉంది. వెంటనే బయలుదేరి రండి"

మామయ్య మాటలకు షాకయ్యాడు భానుమూర్తి. వెంటనే తేరుకుని ఏదో అనబోయాడు. అంతలోనే ఫోన్ కట్టయింది. ఉన్నట్టుండి ఇదేమిటి? బాబుకేమైంది? మతిపోయిందతనికి. భార్యకీ విషయం తెలిస్తే ఆమె ఏమైపోతుందోనని బెదిరిపోయాడు.

"ఎక్కడనుంచండీ ఆ ఫోను?" అడిగింది అలివేణి కాఫీ పట్టుకొస్తూ.

విషయం దాటేసి హడావుడిగా భార్యని ఊరికి బయలుదేరించాడు. ఉలుకుపలుకు లేకుండా పడున్న పిల్లాడిని చూసి స్పృహ కోల్పోయింది అలివేణి. ఏం జరిగిందన్నట్లుగా అత్తమామలవంక చూసాడు భానుమూర్తి.

"మామూలు జ్వరమే అనుకున్నాం. ఫోన్ చేసి మిమ్మల్ని కంగారుపెట్టడం దేనికని డాక్టర్‌గారికి చూపించి మాత్ర వేసాం. గుణం కనిపించకపోయేసరికి భయపడి మీకు తెలియజేసాం" దుఃఖాన్ని దిగమ్రింగుకుంటూ అన్నది రాజ్యం.

ఆవిడ మాటలేవీ భానుమూర్తికి వినిపించ

లేదు. పరుగునవెళ్లి ఆటో పట్టుకొచ్చి బాబును తిరుమల నర్సింగ్‌హోమ్‌కి తీసుకెళ్లాడు. బాబును ఐసియులో వుంచి పరీక్షలు జరిపి వైద్యం చేసారు డాక్టర్లు.రెండుగంటలయ్యాక సుధీర్‌కు స్పృహ వచ్చింది. బాబు క్షేమంగా ఉన్నాడన్న సంగతి తెలుసుకుని హాస్పిటల్‌కు పరుగెత్తుకొచ్చింది అలివేణి. వస్తూనే బాబును ఎత్తుకుని తనివితీరా ముద్దాడింది. మనవడికి స్పృహ రావడంతో ఊపిరి పీల్చుకున్నారు జగన్నాథం దంపతులు.

"బాబుకు బాగా లేనప్పుడు వెంటనే ఆ విషయం మాకు తెలియజేయాలన్న ఇంగితం లేకుండా తాత్సారం చేసి పీకలమీదకు లాక్కొచ్చారు. జరగరానిదేదైనా జరిగితే దానికి ఎవరు బాధ్యత వహిస్తారు? వాడే మీ కన్నబిడ్డయితే ఇలాగే చేసేవారా?" కోపంతో చిందులు తొక్కాడు భానుమూర్తి. నేరస్థుల్లా తలలు వంచుకుని నిలబడ్డారు జగన్నాథం దంపతులు.

★★★

"కథ సుఖాంతమైనందుకు సంతోషంగా ఉంది. అయితే మీకు ఇద్దరబ్బాయిలన్నమాట. పెద్దవాడెప్పుడూ కనిపించడేం? ఎక్కడుంటున్నాడు? ఏం చేస్తున్నాడు?" అడిగింది శ్రావ్య.

"చచ్చిపోయాడు"

ఊహించని సమాధానానికి అవాక్కయింది శ్రావ్య. మాటలు రాక అలివేణి వంక దీనంగా చూసింది. ఆమె చూపుల్ని అర్థం చేసుకున్న అలివేణి "బాబుకు నయమైనందుకు అందరం సంతోషించాం. బతికి బట్టకట్టినందుకు సంబరపడ్డాం. అయితే వాడు ఇక్కడకు వచ్చాక అమ్మమ్మ తాతయ్యలకోసం దిగులు పడతాడని మాత్రం అనుకోలేదు. రాత్రి పగలు 'తాతా' అంటూ కలవరించడం మొదలుపెట్టాడు. వళ్లు నిప్పులా కాలిపోతూ ఉంటే డాక్టర్‌కి చూపించాం. ఫలితం లేకపోవడంతో 'ఒకసారి అమ్మానాన్నలను ఇక్కడకు రమ్మని ఫోన్ చేస్తే' అన్నాను అప్పుడైనా బాబు కళ్లు విప్పుతాడేమోనన్న ఆశతో.

"మీవాళ్లు చేసిన పనికి నా వళ్లు మండిపోతోంది. బొందిలో ప్రాణముండగా ఆ పని చేయను" అన్నారాయన.

పెద్దవాళ్ల కోపతాపాలకు పిల్లవాడు బలైపోయాడు. కానరాని లోకాలకు తరలిపోయాడు.

నాటినుంచి మా ఆయనకీ వాళ్లకు మాటల్లేవు. ఇన్నాళ్లబట్టి చూస్తున్నావు కదా... ఎప్పుడైనా మా కన్నవాళ్లు ఇక్కడకు రావడం గమనించావా? రారు. ఎలా వస్తారు? నాది పేగు బంధం కాబట్టి ఎప్పుడైనా అమ్మానాన్నలను చూడాలనిపిస్తే నేనే ఒంటరిగా వెడుతుంటాను. నామూలంగా చేయని నేరానికి చిత్రహింస అనుభవిస్తున్నారు వాళ్లు."

ఆ మాటలకు ఏమనుకుందో ఏమో..."నా బిడ్డను ఎవరి దగ్గరా ఉంచను. వాడిని వదిలి నేనెక్కడికీ వెళ్లను. నా చిట్టితండ్రి ఎప్పుడూ నాతోనే ఉంటాడు" అంది శ్రావ్య ఓ నిర్ణయానికి వస్తూ.

★

